


## నల్లబెల్లి నుంచి ఆలేరు వరకు..
## మహేందర్ జన్మదిన సందడి


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -72 ఆదివారం16 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts




# భారత్ అభివృద్ధికి ‘సప్తధార’

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ

- తయారీ రంగాన్ని ప్రపంచ సరఫరా కేంద్రంగా మార్చాలని పిలుపు
- రైతుల ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్లాలని సూచన
- సాంకేతికత, 6జీ రంగాల్లో భారత్ ముందుండాలని ఆకాంక్ష
- రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలతో దేశంలో గతిశక్తికి ఊతమివ్వాలని వెల్లడి
- ఆత్మనిర్భర్ రక్షణ, డ్రోన్ సాంకేతికతపై దృష్టి పెట్టాలని సూచన

**ఢిల్లీ ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన ఏడు రంగాలను ‘శక్తి సప్తధార’గా అభివర్ణించారు. దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడంతో పాటు అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ఈ ఏడు శక్తులను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ.. తయారీ రంగం, రైతులు, సాంకేతికత, గతిశక్తి, రక్షణశక్తి, హరిత ఇంధనం, సాఫ్ట్ పవర్‌ను భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఈ రంగాల్లో వేగంగా ముందుకు సాగితే దేశ వృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని చెప్పారు.

మిగతా 2లో.



# స్త్రీశక్తికి ఏడాది పూర్తి..

ఏపీలో రోజూ 24 లక్షల మంది మహిళల ఉచిత ప్రయాణం

మహిళా ప్రయాణికులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సీఎం చంద్రబాబు



**అమరావతిఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ‘స్త్రీ శక్తి’ ఉచిత బస్ ప్రయాణ పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని ప్రభుత్వం వెల్లడించింది.

మిగతా 2లో.

# కళ్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్‌కుట్ర

- ప్రభుత్వ అవినీతిని బట్టబయలు చేస్తున్న సొంత పార్టీ ఎమ్మెల్యేలు
- రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా
- తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంగా మార్చిన రేవంత్ సర్కారు
- కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రతిపక్షాలు మాత్రమే చెప్పడం లేదనీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన సొంత పార్టీ ఎమ్మెల్యేలే బహిరంగంగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని చెప్పారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధే ప్రభుత్వ పెద్దలపై అవినీతిని బట్టబయలు చేసే పరిస్థితి వచ్చిందంటే రాష్ట్రంలో పాలన ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. హైకోర్టు తీర్పు మాటున కళ్యాణలక్ష్మి పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణను ఏఐసీసీకి రాష్ట్ర ప్రభుత్వం ఏటీఎంగా మార్చిందని ఆరోపించారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోడీ సైతం రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అవినీతిపై మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం

మిగతా 2లో.

# దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెట్టాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి -గోల్కొండ కోటలో జాతీయ జెండావిష్కరణ





- నీటి హక్కుల విషయంలో రాజీపడేదే లేదు
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం..రైతుల కండ్లల్లో ఆనందం చూస్తాం
- విద్యాసూచీలో రాష్ట్రాన్ని 18వ స్థానానికి చేర్చాం
- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్
- టీజీఐపాస్ ద్వారా 1.29 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యం

**హైదరాబాద్ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన నీటి హక్కుల విషయంలో రాజీపడేదే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతీ నీటి బొట్టునూ సాధించి తీరుతామన్నారు. తుమ్మడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు

మిగతా 2లో.

# లోక్ భవన్‌లో ‘ఎట్ హోం‘..

- సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లో ‘ఎట్ హోం‘
- గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో తేనీటి విందు
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- పాల్గొన్న మంత్రులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు



**అమరావతి ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**

గవర్నర్, ముఖ్యమంత్రి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్ భవన్‌లో ‘ఎట్ హోం‘ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులను గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆయన అర్ధాంగి సాదరంగా ఆహ్వానించారు.

మిగతా 2లో.



# ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో డిప్యూటి సిఎం భట్టి

**ఖమ్మం,ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల

మిగతా 2లో.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల గడువు ముగింపు

16 నియోజకవర్గాల్లో మొత్తం 60,014 దరఖాస్తులు దాఖలు



**ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఈ నియోజకవర్గాల నుంచి మొత్తం 60,014 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 20వ తేదీ తర్వాత లాటరీ పద్ధతిలో ఇళ్లను

మిగతా 2లో.

# ఇక స్మార్ట్ రేషన్ కార్డులు

సంగారెడ్డి లో ప్రారంభించిన సిఎం రేవంత్

ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా.. కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్

**సంగారెడ్డి ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని అన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు చేయడం కాదని, ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు. సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు.

గతంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించారని రేవంత్ విమర్శించారు. ఇప్పుడు రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతుంటే బీఆర్ఎస్ విమర్శలు

మిగతా 2లో.



# భారత్ అభివృద్ధికి 'సప్తధార'

**మొదటిపేజీ తరువాయి**

1. తయారీ రంగం: భారత్ భవిష్యత్ వృద్ధికి తయారీ రంగమే కీలకమని మోదీ అన్నారు. విడిభాగాలతో పాటు పూర్తి ఉత్పత్తులను దేశంలోనే తయారు చేయాలని సూచించారు. నాణ్యత, తక్కువ ఖర్చు, భారీ ఉత్పత్తితో ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలకంగా మారాలని పిలుపునిచ్చారు.
2. రైతులు: వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాలకు మరింత ఊతమివ్వాలని ప్రధాని చెప్పారు. భారత రైతులకు ప్రపంచ మార్కెట్లు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఎగుమతులను పెంచాలని సూచించారు. చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలను ప్రపంచ బ్రాండ్లుగా మార్చాలని అన్నారు.
3. సాంకేతికత: కొత్త సాంకేతికతలు, డేటా సెంటర్లు, రోబోటిక్స్‌లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఎదగాలని మోదీ ఆకాంక్షించారు. యూపీఐతో భారత సామర్థ్యం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. దేశంలో తయారైన 6జీ సాంకేతికతను దేశవ్యాప్తంగా విస్తరించాలని సూచించారు.
4. గతిశక్తి: దేశంలో రవాణా, అనుసంధాన వ్యవస్థలను మరింత వేగవంతం చేయాలని మోదీ అన్నారు. కొత్త రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మెరుగైన మౌలిక వసతులతో వ్యాపారాలకు మరింత ఊతం లభిస్తుందని చెప్పారు.
5. రక్షణశక్తి: రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశంలోనే రక్షణ పరికరాల తయారీని పెంచాలని సూచించారు. డ్రోన్లు, డ్రోన్ నిరోధక సాంకేతికతలపై పెట్టుబడులు పెంచాలని అన్నారు.
6. హరిత ఇంధనం: హరిత ఇంధన రంగాన్ని భారత్ అభివృద్ధికి కీలక శక్తిగా మోదీ పేర్కొన్నారు. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలకు పెద్దపీట వేయాలని సూచించారు. భవిష్యత్ ఇంధన అవసరాలను తీర్చేందుకు హరిత ఇంధనంపై దృష్టి పెట్టాలని అన్నారు.
7. సాఫ్ట్ పవర్: యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్ భారత్ సాఫ్ట్ పవర్‌ను పెంచుతాయని మోదీ చెప్పారు. సృజనాత్మక రంగాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. పర్యాటక రంగంలోనూ భారత్‌కు ఉన్న అవకాశాలను మరింతగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# ఇక స్మార్ట్ రేషన్ కార్డులు

**మొదటిపేజీ తరువాయి**




చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంపై నిజమైన చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ వేదికగా మాట్లాడుకుందామని సవాల్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రేవంత్ అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాంటివని వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు.కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు వస్తాయని గతంలో బీఆర్ఎస్ ప్రచారం చేసిందని, కానీ ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవని రేవంత్ చెప్పారు. రైతు భరోసా పథకం కింద 32 నెలల్లో రూ.36 వేల కోట్లు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం దేశంలో తక్కువ అప్పులు ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని అన్నారు. బీజేపీ నేతలు ఆ నివేదికలు చదివితే నిజాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు.స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం ప్లాస్టిక్ కార్డులు కావని, పేదల ఆత్మగౌరవానికి గుర్తని రేవంత్ చెప్పారు. ఆకలి తీర్చే భరోసానే ఈ కార్డుల ఉద్దేశమని అన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.

# లోక్ భవన్‌లో 'ఎట్ హోం'..

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా గవర్నర్, ముఖ్యమంత్రి ఇరువురూ ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.అనంతరం గవర్నర్ దంపతులు ఆహ్వానితులకు తేనీటి విందు ఇచ్చారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ స్వయంగా ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సైనిక అధికారులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖుల రాకతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ వాతావరణంలో సందడిగా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం కొనసాగింది.
అనారోగ్యం కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కాకినాడలో ఇవాళ స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ లో పాల్గొన్న అనంతరం పవన్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో, ఆయన ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొనడంలేదని జనసేన పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. రాజమండ్రిలో వైద్య పరీక్షల అనంతరం పవన్ కల్యాణ్ హైదరాబాద్ వెళ్లిపోయారు.

# స్త్రీశక్తికి ఏడాది పూర్తి..

**మొదటిపేజీ తరువాయి**

పథకం తొలి వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ (ఆగస్టు 15) ఆర్టీసీ బస్సులో ప్రయాణించి, లబ్ధిదారులైన మహిళలతో ముచ్చటించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ఆర్టీసీ బస్సు ఎక్కి, అందులో ప్రయాణిస్తున్న మహిళలతో మాట్లాడారు. పథకం అమలు తీరుపై వారి నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి కుటుంబాలు, జీవనోపాధి, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా వారికి కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు.
ఎన్డీయే ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలలో భాగంగా 2025 ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ప్రయాణ సమయంలో ఏపీకి చెందినవారని ధ్రువీకరించే గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఎంత దూరమైనా, ఎన్నిసార్లైనా ప్రయాణించేందుకు ఎలాంటి పరిమితి లేదు. ప్రధాన పండుగల సమయంలో దేవాలయాలకు నడిపే ప్రత్యేక బస్సులకు కూడా ఈ సౌకర్యాన్ని వర్తింపజేశారు.ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 87 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయి. పథకానికి ముందు రోజుకు సగటున 9.47 లక్షలుగా ఉన్న మహిళా ప్రయాణికుల సంఖ్య, ఇప్పుడు 24 లక్షలకు చేరింది. దీంతో ఆర్టీసీ మొత్తం ప్రయాణికుల్లో మహిళల వాటా 40 శాతం నుంచి 62 శాతానికి పెరిగింది. ఈ పథకం వర్తించే బస్సుల్లో ఆక్యుపెన్సీ రేటు 93 శాతానికి చేరుకోవడం విశేషం. ఏపీఎస్ఆర్టీసీకి చెందిన 9,978 బస్సుల్లో దాదాపు 7,631 బస్సుల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంది.
ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రోజుకు రూ.8.53 కోట్ల సబ్సిడీని భరిస్తున్నట్లు తెలిపింది. మొదటి ఏడాదిలో మొత్తం ఖర్చు రూ.3,095 కోట్లుగా నమోదైంది. 2026-27 బడ్జెట్‌లో కూడా ఈ పథకం కొనసాగింపు కోసం రూ.1,420 కోట్లు కేటాయించారు.

# క్యూ్యర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల గడువు ముగింపు

**మొదటిపేజీ తరువాయి**

కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పి.వి. గౌతం తెలిపారు.
మరోవైపు, నగరంలోని మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం రేపటి నుంచి కొత్తగా దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల ప్రజలు సెప్టెంబర్ 3వ తేదీ వరకు 'మీ సేవ' కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.ఈ నియోజకవర్గాల లబ్ధిదారుల కోసం నిర్మించనున్న ఇళ్ల ప్రాంతాలను కూడా అధికారులు ఖరారు చేశారు. ఎల్బీనగర్ వాసులకు ఆమన్ గల్‌లో, గోషామహల్, ముషీరాబాద్ వాసులకు జమిస్తాన్‌పూర్‌లో, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని వారికి బండ్లగూడలో ఇళ్లను కేటాయించనున్నారు.

# దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెట్టాం

**మొదటిపేజీ తరువాయి**

సాగునీరు అందిస్తామని ఆయన హామీనిచ్చారు. వ్యవసాయాన్ని పండుగగా మార్చి రైతుల కండ్లల్లో ఆనందం చూస్తామని వ్యాఖ్యానించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎంకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రిడ రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తమ 32 నెలల పరిపాలనలోసాధించిన విజయాలు, అమలు చేసిన పథకాలు, వాటి ఫలితాలను ఆయన సోదాహరణంగా ఏకరువు పెట్టారు. 2025-26లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,932 (దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం అధికం)గా ఉండటాన్ని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలమని ఆయన అభివర్ణించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు 1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వరి సాగు, విస్తీర్ణంలో దేశంలోనే రాష్ట్రం నెంబర్ వన్ గా నిలిచిందంటూ హర్షం వ్యక్తం చేశారు. గత యాసంగిలో 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు చెప్పారు.

**విద్యాసూచీలో 18వ స్థానం**

విద్యారంగంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు స్పష్టమైన ఫలితాలనిచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో వందకుపైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణమే లక్ష్యమని చెప్పారు. వీటిలో ఇప్పటికే 105 స్కూళ్లను మంజూరు చేశామనీ, 84 బడులకు అనుమతులిచ్చామని వివరించారు. ప్రతీ నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించామనీ, డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 212 శాతం పెంచామని గుర్తు చేశారు. దాదాపు 22 లక్షల మంది పిల్లలకు అల్పాహారం, పాలు, పోషకాహారం అందిస్తున్నట్టు తెలిపారు. జూనియర్ కాలేజీల్లో సైతం మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్టు వివరించారు. 11 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయిబర్స్ మెంట్ ను వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చామని చెప్పారు.

**ఆ మాణిక్యాల కోసం సీఎం కప్**

గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను ప్రపంచస్థాయికి తీసుకెళ్లే క్రీడా విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు గచ్చిబౌలిలో స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్ ను ఏర్పాటు చేశామని అన్నారు. మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్ ను నిర్వహించినట్టు వివరించారు. త్వరలో తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ -2026'ను నిర్వహించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. యువతకు విద్యతో పాటు నైపుణ్య కోర్సుల్లో శిక్షణను అందిస్తూ ఉద్యోగవకాశాలను పెంచామని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే 72 వేల ఉద్యోగాలను భర్తీ చేశామనీ, టీజీపీఎస్సీ ద్వారా 456, పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ద్వారా 7,435 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. నోటిఫికేషన్లు ఇచ్చే బాధ్యత తమదనీ, చదువుకుని ఉద్యోగాలు దక్కించుకోవాల్సిన బాధ్యత యువతదని సూచించారు. ఇతర వ్యాపకాల వైపు మళ్లకుండా పరీక్షలకు సిద్ధపడాలని విద్యార్థులను కోరారు.

**వెల్లువలా పెట్టుబడులు**

టీజీఐపాస్ ద్వారా ఇప్పటికే రూ.1.29 లక్షల పెట్టుబడులు సాధించామనీ, వీటితో 78 వేలకు పైగా ఉద్యోగవకాశాలు రాబోతున్నాయని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరినట్టు చెప్పారు. 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయనీ, ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలకు పెరిగాయని తెలిపారు. హైదరాబాద్ లో ఇప్పటికే 355కు పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు ఉన్నాయనీ, 2026లో కొత్తగా 40 సెంటర్లు వచ్చాయని తెలిపారు. దీంతో రాష్ట్రం పెట్టుబడులకు చిరునామాగా మారుతున్నదని సీఎం హర్షం వ్యక్తం చేశారు.

**2034 నాటికి కోటి మంది మహిళలు కోటీశ్వరులు**

2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ దిశగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలు, ఆర్థిక సాయాల కోసం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.60,487 కోట్ల రుణాలను అందించామన్నారు. వడ్డీ లేని రుణాల కింద రూ.1,900 కోట్ల రాయితీని విడుదల చేసినట్టు తెలిపారు. మహిళలను పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులకు యజమానులుగా మార్చామన్నారు.

**సామాజిక భద్రతకు పెద్దపీట**

తమ ప్రభుత్వం సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 3.38 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని అన్నారు. రెండో దశలో 2.50 లక్షల కొత్త ఇండ్ల మంజూరుతోపాటు క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన వారికి కొత్తగా ఫించన్లకు మంజూరు హామీనిచ్చారు. ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లును ఆమోదించామని, మొత్తం వ్యయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి 12.4 శాతం కేటాయించామని తెలిపారు.

కనీస వేతనాల సవరణ

పన్నెండేండ్ల నుంచి పెండింగ్ లో ఉన్న కనీస వేతనాలను తమ ప్రభుత్వం సవరించిందని సీఎం వివరించారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చట్టం తెచ్చామనీ, అదే విధంగా సినీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వయస్సు మళ్లిన తల్లిదండ్రుల విషయంలో ఉద్యోగులైన పిల్లల బాధ్యతను గుర్తుచేసేలా చట్టం చేశామని అన్నారు. రోహిత్ వేముల చట్టానికి రూపకల్పన చేస్తున్నట్టు చెప్పారు.

**టీజీ సేఫ్ తో కల్తీ నియంత్రణ**

డ్రగ్స్ ముప్పుతో పాటు ఆహారకల్తీని పూర్తిగా నియంత్రించేందుకు టీజీసేఫ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు. కల్తీ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు ఉస్మానియా ఆస్పత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మూడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు నూతన భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఎనిమిది మెడికల్ కాలేజీలకు కొత్త భవనాలను నిర్మించేందుకు నిర్ణయించామని వివరించారు. సీఎం సహాయనిధి కింద నిరుపేద రోగులకు రూ.2,526 కోట్లు అందించినట్టు తెలిపారు.
కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సహా ఉద్యోగులందరికి ప్రతీ నెలా మొదటి తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకున్నామని సీఎం గుర్తు చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తున్నామనీ, ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే రూ.6 వేల కోట్లను విడుదల చేశామని తెలిపారు.
డిజిటల్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పారదర్శకమైన పాలన అందించడంలో భాగంగా త్వరలోనే ఆన్ లైన్ ప్రజావాణి పోర్టల్ ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా 360 కిలోమీటర్ల ట్రిబుల్ ఆర్ నిర్మాణంతో పాటు 6,092 కిలోమీటర్ల హ్యామ్, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ మెట్రో రెండో దశను ముందుకు తీసుకెళ్తున్నట్టు తెలిపారు. మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణతోపాటు ఆదిలాబాద్ జాయింట్ యూజ్ ఎయిర్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రోడ్, రైల్, విమాన, లాజిస్టిక్స్ కనెక్టివిటీ విస్తరించే దిశగా ముందుకెళ్తున్నట్టు తెలిపారు.

# కళ్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్‌కుట్ర

ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో లేదా రాజకీయ వేదికలపై అవినీతి ఆరోపణలు చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే కేంద్ర దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై గతంలో ఈడీ దాడులు నిర్వహించిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారో, విచారణ ఎక్కడికి చేరిందో ప్రజలకు స్పష్టత లేదన్నారు. పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి రూ.ఐదు లక్షలు లేదా రూ.ఆరు లక్షల సాయం పొందాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం వందలాది నిబంధనలు, షరతులు విధిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచే వస్తున్నాయని అన్నారు. సామాన్యుడి అవసరాలను పట్టించుకోకుండా, అధికారంలో ఉన్నవారి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రజా పాలన కాదన్నారు.
రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపదేపదే చెప్తున్నారనీ, ఆయన పనిచేస్తున్నది రాష్ట్రం కోసం కాదని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కుటుంబ సభ్యులు, అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుడికి భూములు, కాంట్రాక్టులు, నిధులు దోచిపెట్టేందుకే పనిచేస్తున్నారని ఆరోపించారు. ఎనుముల తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులకుభూములు ఎలా సమకూర్చాలి, వారికి ఎలా సంపద దోచిపెట్టాలి, కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులకు ఎలా ప్రయోజనాలు కల్పించాలి అన్నదానిపైనే సీఎం దృష్టి ఉందన్నారు. ఎవరి ప్రయోజనాలు కాపాడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో అవినీతి, ప్రజా సంక్షేమం, ప్రభుత్వ పథకాలు, యువత హక్కులు వంటి అన్ని అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను సమీక్షించుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, గతంలో అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగించాలనీ, అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాజకీయ, కుటుంబ ప్రయోజనాలకు పాలనను పరిమితం చేస్తే ప్రజలు తగిన సమయంలో సమాధానం చెప్తారని కేటీఆర్ హెచ్చరించారు.
కళ్యాణ లక్ష్మి పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కల్యాణలక్ష్మి అంశంలో హైకోర్టు తీర్పు వెలువడిందని అన్నారు. లక్షలాది మంది ఆడబిడ్డల జీవితాలకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన ఆ పథకంపై స్పందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం లేకుండా పోయిందా?అని ప్రశ్నించారు.
ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం అదనంగా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఉన్న కల్యాణలక్ష్మి పథకాన్నే నిర్వీర్యం చేసే పరిస్థితికి తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

**మొదటిపేజీ తరువాయి**

జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నకిలీలను పూర్తిగా అరికట్టేందుకు ఈ కొత్త స్మార్ట్ కార్డులలో ఎన్క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, ప్రత్యేక హోలోగ్రామ్, వాటర్ మార్క్, యూవీ లోగో సహా 9 రకాల పటిష్టమైన భద్రతా ఫీచర్లను పొందుపరిచామని భట్టి అన్నారు. ఈ-పాస్ యంత్రాలతో బయోమెట్రిక్ విధానాన్ని అనుసంధానించి రేషన్ పంపిణీలో నూరు శాతం పారదర్శకతను తీసుకువస్తున్నామన్నారు. ాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా 3.42 కోట్ల మందికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సరికొత్త డిజిటల్ కార్డులు మంజూరు చేస్తూ, వాటి ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాం.పేదలకు మెరుగైన వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కల సాకారం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా,




ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేలా మన ప్రభుత్వం అడుగులు వేస్తోందని భట్టి తెలిపారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని భట్టి చెప్పుకొచ్చారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్దిదారులకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# నూతన పదవులతో దళిత సంక్షేమానికి ప్రాధాన్యం



**పర్వతగిరి/ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన జిల్లా కార్యదర్శి మాసాని యాకూబ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మాసాని సుధాకర్‌లను ఏనుగల్లు గ్రామంలో జాంబవ పరపతి సంఘం, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జాంబవ పరపతి సంఘం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మాసాని ప్రదీప్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాసాని గోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాసాని యాకూబ్, మాసాని సుధాకర్‌ల సేవలను గుర్తించి నూతన బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. వారికి పదవులు రావడానికి కృషి చేసిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన బాధ్యతలను కేవలం పదవులుగా భావించకుండా ప్రజలకు, ముఖ్యంగా దళితులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు దళితుల అభ్యున్నతి, హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పనిచేయాలని కోరారు. దళిత వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా నాయకులు చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. నూతన పదవులు పొందిన నాయకులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాసాని ప్రదీప్, బిక్షపతి, మాంకాల శ్రీనివాస్, జన్ను దిలీప్, సునీల్, సంతోష్, రవి, అలోక్, జెండర్ రవీందర్, మొగిలి అశోక్, డానియల్, సిర్ర మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## డాన్‌బోస్కో పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**తల్లాడ/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** తల్లాడ మండలం పాత పినపాకలోని డాన్‌బోస్కో పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. మార్చ్‌పాస్ట్ పరేడ్‌తో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పూర్వ విద్యార్థి డాక్టర్ మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇతర అతిథులతో కలిసి జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ఐక్యత, దేశసేవా భావాలను అలవర్చుకోవాలని సూచించారు. దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రదీప్, ఫాదర్ రాజేష్, ప్యారిష్ ప్రీస్ట్, వైస్ రెక్టర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతీయ ఐక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రదర్శనలు సాగాయి. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



**మహబూబాబాద్/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):**
మహబూబాబాద్ జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో దేశ సేవకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను గౌరవంగా విని, చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుత ప్రవర్తన పాటించాలని తెలిపారు. ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు ఎస్పీ సేవా పతకాలను అందజేశారు. దేశ సమగ్రత, శాంతి, భద్రత కోసం ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు చిరస్మరణీయం

### జాతీయ జెండాను ఆవిష్కరించిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మొహమ్మద్ నజీర్ అహ్మద్



**కేసముద్రం/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ నజీర్ అహ్మద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. దేశ సమగ్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, టౌన్ పార్టీ అధ్యక్షుడు గుగులోత్ వీరునాయక్, నాయకులు పోలు వెంకన్న, రావుల వినయ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సట్ల వెంకన్న, కొమ్ము రాహుల్, మోడం రవీందర్‌గౌడ్, తారాసింగ్, తోట శీను, ఎస్.కె. జానీ, కుమార్‌స్వామి, శ్రీరంగం జాఫర్, నాగూర్‌భాషా, కాసు సాయి, భీమానాయక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జనహృదయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు



**జమ్మికుంట/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు జన్మదిన వేడుకలను జమ్మికుంటలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని 15వ వార్డు కేశవపురం గ్రామంలోని పంట పొలాల వద్ద రోజువారీ కూలీల మధ్య వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కూలీ మహిళలకు పెద్ద ఎత్తున చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కూలీలతో కలిసి కేక్ కట్ చేసి ప్రణవ్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, జిల్లా నాయకుడు సాయిని రవి, 15వ వార్డు కౌన్సిలర్ పాతకాల మౌనిక-అనిల్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొనగంటి రవీందర్, మహిళా పట్టణ అధ్యక్షురాలు రేణుక శివకుమార్‌గౌడ్, జమ్మికుంట యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాచపల్లి సాగర్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాతకాల ప్రవీణ్, చిన్నింటి నాగేంద్ర, రాచపల్లి గణేష్, రైతులు, కూలీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేసముద్రంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



**కేసముద్రం/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** కేసముద్రం పట్టణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మువ్వన్నెల జెండాలతో కళకళలాడాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి జెండాను ఆవిష్కరించారు. రైతు సంక్షేమమే ధ్యేయమని, మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రావు జెండాను ఆవిష్కరించి గ్రామీణాభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జి.వివేక్ జెండాను ఆవిష్కరించి ప్రజలకు పారదర్శక సేవలందించడమే అమరవీరులకు నిజమైన నివాళి అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై క్రాంతికిరణ్ జెండాను ఆవిష్కరించి శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమాల్లో తోట హరీష్, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



**హనుమకొండ/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):**
న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దేశభక్తి గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో చిన్నారులు అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి. భూమేష్‌రావు, డైరెక్టర్లు కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పి. భూమేష్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో నాయకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారని తెలిపారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులు స్వేచ్ఛాయుతంగా, బాధ్యతాయుతంగా మెలుగుతూ భవిష్యత్ భారతదేశ రూపకర్తలుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు షాజీ మాథ్యూ, భువన ప్రసాద్, ఏవో నరసింహరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



**మహబూబాబాద్/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను ప్రజాప్రతినిధులతో కలిసి సన్మానించారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు, అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

**కలెక్టరేట్‌లో వేడుకలు:** జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరీష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ పురుషోత్తం, డీఆర్‌ఓ నాగవాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోనూ కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అధికారులు, సిబ్బంది జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.

## లూర్దుమాత హైస్కూల్‌లో స్వాతంత్ర్య వేడుకలు



**తల్లాడ/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** తల్లాడ మండల పరిధిలోని లూర్దుమాత హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తల్లాడ ఎస్సై బి. వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సత్య, హెడ్‌మిస్ట్రెస్ సిస్టర్ ప్రసన్న ముఖ్యఅతిథికి స్వాగతం పలికారు. అనంతరం ఇన్వెస్టిచర్ సెరిమనీలో నూతన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎందరో మహానుభావుల త్యాగఫలమే నేటి స్వాతంత్ర్యం

### కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న

**కేసముద్రం/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):**




ఎందరో మహానుభావుల త్యాగాలు, పోరాటాల ఫలితమే నేటి స్వాతంత్ర్యమని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, రేకులతండా అంగన్‌వాడీ కేంద్రం వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు తరాల వీరేష్‌యాదవ్, దారావత్ కిషోర్, కనుకుల సుభద్ర, బానోత్ విజయ, వినయ, మార్కెట్ డైరెక్టర్ ఎండీ అయూబ్‌ఖాన్, చింతకుంట్ల యాదగిరి, గుగులోత్ వీరునాయక్, జాటోత్ హరీష్‌నాయక్, బానోత్ దేవేందర్, ఎండీ తాజుద్దీన్, ఎండీ రఫీ, తరాల సుధాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం గణేష్, గుల్లేపెల్లి రాజేష్, ఏలేందర్, ప్రభాకర్, బానోత్ భద్రు, బానోత్ కిషన్, కళాధర్, ఎండీ సమీర్, ఎండీ రియాజ్, కాట్రేవుల హరికృష్ణ, సాయి, బానోత్ సేవల్, గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం

### ఉద్యమకారులను గుర్తించి గౌరవించాలి: ఎక్కటి సంజీవరెడ్డి



**జమ్మికుంట/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** జమ్మికుంట అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫోరం జమ్మికుంట శాఖ అధ్యక్షుడు మద్దూరి శంకరయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం సెక్రటరీ జనరల్, జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో అమరవీరులు చేసిన త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ అని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల పోరాట ఫలితంగానే స్వరాష్ట్రంలో స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఆగస్టు 15, జనవరి 26న నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవాల్లో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గౌరవించడం ద్వారా భావితరాలకు తెలంగాణ ఉద్యమ చరిత్ర, వారి పోరాట స్ఫూర్తి తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారుల నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి, రచ్చ గణేష్, పాతకాల ఓదేలు, రామ్‌రాజబాబు, మోతే స్వామి, ఎగిత కొమురయ్య, ఏబూషి ఓదేలు, గండికోట సమ్మయ్య, రమేష్, బిట్ల శీను, పొడేటి అనిల్, మొలుగు శీను, మోతే రాజు తదితరులు పాల్గొన్నారు

# అనసాగర్, జయగిరిలో జెండా ఆవిష్కరణ



**హసన్‌పర్తి, ఆగస్టు 15 (జర్నలిస్టు వార్త):** అనసాగర్, జయగిరి గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హసన్‌పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అనసాగర్ సర్పంచ్ దయాకర్ వెన్నెల, డీసీసీ కార్యదర్శి బండ చంటి రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఐలయ్య, సీనియర్ నాయకుడు రామంచ ఐలయ్య, జయగిరి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గట్టు స్వామి, సంతోష్, పోగుల రాజ్‌కుమార్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, వార్డు సభ్యులు ప్రవీణ్, ఆనంద్, కృష్ణమరాజు, రాజు, అనూష, అనిల్, ఉపసర్పంచ్, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ, బీసీ, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రణవ్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు

## టీపీసీసీ సాంస్కృతిక సేన కళాకారులు



**వీణవంక/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు జన్మదిన వేడుకలు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాంస్కృతిక సేన కరీంనగర్ జిల్లా కళాకారులు పాల్గొని ప్రణవ్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడు, కవి, గాయకుడు గోనెల సమ్మన్న ముదిరాజ్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొట్టాల శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోనెల సమ్మన్న మాట్లాడుతూ ప్రణవ్‌బాబు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రణవ్‌బాబుకు ఆయురారోగ్యాలు, నిండు నూరేళ్ల జీవితం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# శాంతియుత వాతావరణంలో బోనాలు జరుపుకోవాలి



**కేసముద్రం/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంతో పాటు పరిధిలోని గ్రామాల్లో నిర్వహించనున్న బోనాల పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ సత్యనారాయణ, ఎస్సై క్రాంతికిరణ్ కోరారు. శనివారం కేసముద్రంలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించిన అధికారులు పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బోనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అల్లం నాగేశ్వరరావు, జాటోత్ హరీష్‌నాయక్, గుగులోత్ వీరునాయక్, బానోత్ వెంకన్ననాయక్, దేవేందర్‌నాయక్, ఆగే రాము, బద్య నాయక్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే బీఎల్ఆర్



**మిర్యాలగూడ/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుని వారి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

అవంతిపురంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు పల్లీపట్టి పంపిణీ చేశారు. మిర్యాలగూడ రాజీవ్‌భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. విశ్వకర్మ కార్పెంటర్స్ యూనియన్, నాయి బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఎమ్మెల్యే బీఎల్ఆర్ కోరారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసముద్రంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు

## జెండా ఆవిష్కరించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు




**కేసముద్రం/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 12వ వార్డులో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. దేశ సమగ్రత, ఐక్యతను చాటిచెప్పేలా ప్రతి వార్డులో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు, ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేసముద్రంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ జెండాను ఆవిష్కరించిన వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు



**కేసముద్రం/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. 12వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ఐక్యతను చాటిచెప్పేలా ప్రతి వార్డులో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు, ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



**సత్తుపల్లి/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** పట్టణంలోని శ్రీ సర్దార్ జలగం వెంగళరావు మున్సిపల్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకున్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని కాపాడుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భీమారం పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు




**హసన్‌పర్తి/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** భీమారం జడ్పీ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

గత విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి వరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కెనరా బ్యాంకు నయీమ్‌నగర్ శాఖ మేనేజర్ భాస్కర్, పంజాబ్ నేషనల్ బ్యాంకు నయీమ్‌నగర్ శాఖ మేనేజర్ సందీప్ నగదు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. భవిష్యత్‌లో తమ బ్యాంకుల సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా ప్రతిభావంతులకు మరింత సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల దేశభక్తి గేయాలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల పీడీ శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్లు, లెజిమ్స్ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, ఉషారాణి, చేరాలు, సరోజ, తిరుపతి, అంజనీదేవి, మస్రత్ బేగం, రాణి సంయుక్తదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వీర్లపాలెంలో ఇండియన్ ఆయిల్ బంక్‌లో స్వాతంత్ర్య వేడుకలు



**దామరచర్ల/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోని జై మైసమ్మ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బంక్ లీజ్ ఇన్‌చార్జి మూడావత్ హుస్సేన్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించి జై జవాన్.. జై కిసాన్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా దేశభక్తిని చాటుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పెట్రోల్ బంక్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ద

# హసన్‌పర్తి పీఎస్‌లో స్వాతంత్ర్య వేడుకలు



**హసన్‌పర్తి/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు సిబ్బంది, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవలను కొనియాడారు. కానిస్టేబుల్ ధనుంజయ్‌కు నివాళి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ ధనుంజయ్‌కు పోలీసు సిబ్బంది ఘన నివాళులర్పించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన ధనుంజయ్ మృతి పోలీసు శాఖకు తీరని లోటని ఇన్‌స్పెక్టర్ మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ధనుంజయ్ కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐలు దేవేందర్, రవి, సుజిత్, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బిల్లుపాడులో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**తల్లాడ/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** మండలంలోని బిల్లుపాడు గ్రామపంచాయతీ పరిధిలోని హైస్కూల్ వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి, నరసింహారావు జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన దీక్షితకు స్వర్గీయ జక్కంపూడి కృష్ణమూర్తి, ప్రేమలత జ్ఞాపకార్థం వారి కుమారులు జక్కంపూడి కిషోర్, జక్కంపూడి రాము రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థి వంశీకి బాపనయ్య, రూపతమ్మ జ్ఞాపకార్థం రూ.5 వేల బహుమతిని అందించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో పాలు తాగేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన సామినేని రామప్పరావు పాఠశాల విద్యార్థుల కోసం 5 వేల గ్లాసులను బహూకరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సామినేని రామప్పరావు, జక్కంపూడి రమేష్, బిల్లుపాడు మాజీ ఎంపీటీసీ బత్తుల రామదాసు, రాయల లక్ష్మయ్య, ఇంజం నరసింహారావు, ఇనపనూరి బాబు, గ్రామపంచాయతీ సిబ్బంది ప్రభాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# కేసముద్రం గర్వపడేలా..
# ఇద్దరు ఏవోలకు పురస్కారాలు




**మహబూబాబాద్/ ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):**
కేసముద్రం మండలానికి చెందిన ఇద్దరు వ్యవసాయ అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా స్థాయి ప్రశంసా పత్రాలు లభించాయి. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసినందుకు ఈ గుర్తింపు దక్కింది.
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్ చేతుల మీదుగా పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా వ్యవసాయ అధికారి పాల్గొన్నారు.కేసముద్రం మండలం దన్నసరి గ్రామానికి చెందిన జక్కుల ఉదయ్ ప్రస్తుతం కొత్తగూడ మండల వ్యవసాయ అధికారిగా, కోరుకొండపల్లి గ్రామానికి చెందిన కర్పూరపు అనిల్‌కుమార్ డోర్నకల్ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను రైతులకు చేరవేయడం, సకాలంలో సాంకేతిక సూచనలు అందించడం, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు వ్యవసాయ అభివృద్ధికి సేవలందించినందుకు వీరిని జిల్లా స్థాయిలో ఎంపిక చేశారు.ఒకే మండలానికి చెందిన ఇద్దరు అధికారులు ఒకే శాఖలో ఉత్తమ సేవలకు పురస్కారాలు అందుకోవడం కేసముద్రం మండలానికి గర్వకారణమని స్థానికులు పేర్కొన్నారు. పురస్కార గ్రహీతలకు రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పురస్కారం తమపై మరింత బాధ్యత పెంచిందని, భవిష్యత్తులోనూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

## త్యాగాల స్ఫూర్తితో ముందుకు సాగాలి



**హనుమకొండ /బ్యూరో ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీఎస్ఆర్ కాలనీ అధ్యక్షుడు కుక్కల రాజు పిలుపునిచ్చారు. హనుమకొండ రెండో డివిజన్ పరిధిలోని గుండ్లసింగారం జీవీఎస్ఆర్ కాలనీలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు.ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణత్యాగాలు, వీరోచిత పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. భిన్న మతాలు, భిన్న సంస్కృతులకు భారతదేశం నిలయంగా నిలిచి ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యాన్ని కేవలం హక్కుగా భావించకుండా దేశం పట్ల బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవినాయక్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి, మాజీ హనుమకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి అజయ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజయ్య, సీసీ రోడ్డు కాంట్రాక్టర్ నాగేశ్వరరావు, కోశాధికారి యాకయ్య, కమిటీ సభ్యులు కొమురయ్య, పరమాత్మ, కుక్కమూడి వంశీ, మోహన్, రమేష్, మల్లయ్యతోపాటు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## ఎలుకుర్తిలో ఘనంగా గణతంత్ర వేడుకలు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త)**మండలంలోని ఎలుకుర్తి గ్రామంలో కాకతీయ యువజన సంఘం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బేరే లక్ష్మణ్ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం దేశభక్తి, జాతీయ సమైక్యతపై యువతకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పాండ్యాల మహేష్, గుండు రాజేష్, ప్రధాన కార్యదర్శి గోనెల చంటి, కోశాధికారి పాండ్యాల రాజేష్, ప్రచార కార్యదర్శి నరిశెట్టి కార్తీక్‌తోపాటు మాజీ అధ్యక్షులు, సలహాదారులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, దేశ ఐక్యతను కాపాడుతూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని వారు పిలుపునిచ్చారు.

# వివేకవర్ధిని హైస్కూల్లో స్వాతంత్ర్య వేడుకలు



**కేసముద్రం/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని, దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు



**ఖమ్మం/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** ఖమ్మం జిల్లా టీడీపీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు, హడ్‌హక్ కమిటీ సభ్యుడు కూరపాటి వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. 91 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధుడు కృష్ణమూర్తి స్వాతంత్ర్య పోరాట గీతాలు ఆలపించారు.
ఈ సందర్భంగా కూరపాటి మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యమని, రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో టీడీపీని బలోపేతం చేసేందుకు త్వరలో పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉప తహసీల్దార్ ఎర్రయ్యకు ఉత్తమ ప్రతిభా పురస్కారం



**కేసముద్రం/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):**
రెవెన్యూ శాఖలో విశిష్ట సేవలందించిన కేసముద్రం ఉప తహసీల్దార్ ఎర్రయ్యకు ఉత్తమ ప్రతిభా పురస్కారం లభించింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్, కలెక్టర్ స్నేహ శబరిష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. నారాయణపురం రైతులకు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాల జారీకి చొరవ చూపడంతోపాటు రెవెన్యూ సేవల్లో చూపిన ప్రతిభకు ఈ గుర్తింపు దక్కింది. ఎర్రయ్యను అధికారులు, సహచర ఉద్యోగులు అభినందించారు.

# బాధ్యతగల పౌరులుగా ఎదగాలి

**స్వాతంత్ర్యం హక్కులతో పాటు బాధ్యతను గుర్తు చేస్తుంది: ఎంవీఐ రాజశేఖర్**



**సత్తుపల్లి/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):**
ఎందరో త్యాగమూర్తుల త్యాగాల ఫలితమే భారత స్వాతంత్ర్యమని సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని పేర్కొన్నారు. సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయంలో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కేవలం హక్కులు మాత్రమే కాదని, బాధ్యతను కూడా గుర్తు చేస్తుందన్నారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించడంతో పాటు బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. సమాజం పట్ల బాధ్యత, ఇతరులను గౌరవించడం, క్రమశిక్షణతో మెలగడం వంటి విలువలను అలవర్చుకోవాలన్నారు.తల్లిదండ్రులు పిల్లలకు సంపదతో పాటు మంచి విలువలు, సంస్కారం, వ్యక్తిత్వాన్ని అందించాలని సూచించారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారిని మంచి మనుషులుగా, బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయ యాజమాన్య ప్రతినిధి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మదర్ థెరిస్సా సేవాసదనంలో
# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**మధిర/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):** మధిర పట్టణ పరిధిలోని మదర్ థెరిస్సా సేవాసదనంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సామాజిక సేవకులు, పుర ప్రముఖులు పుల్లఖండం చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మానసిక దివ్యాంగ పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పుల్లఖండం చంద్రశేఖర్ మానసిక దివ్యాంగ పిల్లలతో కొంత సమయం గడిపి వారితో ఆప్యాయంగా మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన సేవాసదనం నిర్వాహకులకు, సిబ్బందికి పిల్లల తరఫున అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో సామాజిక సేవకులు, విశ్రాంత ఎంపీడీవో మాధవరపు నాగేశ్వరరావు, శ్రీరామ ఫోటో స్టూడియో నాగభూషణం, టెంట్ ప్రసాద్, మాజీ వార్డు సభ్యుడు మోచర్ల సురేష్, నీలం రమేష్, కోట రంజిత్, వేల్పుల శివ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాల స్ఫూర్తితో దేశాభివృద్ధికి పాటుపడాలి



**సత్తుపల్లి/ఆగస్టు 15 (జర్నలిస్ వార్త):**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సత్తుపల్లి కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రుద్రాక్షల అప్పాచారి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అప్పాచారి మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. విద్యలో ఉన్నతంగా రాణిస్తూ దేశ ప్రగతికి తోడ్పడాలని, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రుద్రాక్షల శ్రీనివాసాచారి, కందుకూరి వెంకటాచారి, బాణాల కృష్ణప్రసాద్, ఎ. కోటేశ్వరరావు, షేక్ బాబా, వై. యోగీశ్వరాచారి, వై. రామకృష్ణ, వి. వీరభద్రాచారి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# కార్మికుల ఐక్యతే బలం..
# హక్కుల సాధనకు పోరాటమే మార్గం

**ఎల్కుర్తిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని బి.ఎన్.ఆర్.కె.ఎస్. భవన నిర్మాణ రంగాల కార్మిక సమాఖ్య నాయకులు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి గ్రామంలో బి.ఎన్.ఆర్.కె.ఎస్. భవన నిర్మాణ రంగాల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.సంఘం అధ్యక్షుడు కొలిపాక స్వామి జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారని అన్నారు. దేశ నిర్మాణంలో భవన నిర్మాణ రంగ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.కార్మికుల శ్రమతోనే పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నా.. వారి సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడంతో పాటు సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గమని అన్నారు.కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కనాటి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మారబోయిన కుమార్, గౌరవ అధ్యక్షుడు జోగు సాంబయ్య, కార్మిక సంఘం సభ్యులు, భవన నిర్మాణ రంగ కార్మికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



## దేశానికి మనం ఏమి చేయగలమో ఆలోచించాలి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):** దేశం మనకు ఏమిచ్చిందని ప్రశ్నించడం కాదు.. దేశానికి మనం ఏమి చేయగలమో ఆలోచించాలని బీజేపీ ధర్మసాగర్ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం ధర్మసాగర్‌లో ఆయన ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్, సర్దార్ వల్లభాయ్ పటేల్ తదితరుల త్యాగాలను ప్రతి భారతీయుడు స్మరించుకోవాలన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, శాంతిభద్రతలను కాపాడుతూ దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని ఆచరణలో చూపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నిమ్మ సుదర్శన్‌రెడ్డి, నాగవెల్లి యుగేందర్, గంకిడి వెంకట్‌రెడ్డి, కొంతం కృష్ణమూర్తి, గాజుల సంపత్, పెరుమాండ్ల అమరేందర్‌రెడ్డి, పులా శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు దుస్స రాములు, దాసరి సదానందం, మండల నాయకులు శ్రీరాముల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు బచ్చు శివప్రసాద్‌రెడ్డి, సాయం సందీప్, 8వ వార్డు సభ్యురాలు కల్యాణి, బీజేవైఎం మండల అధ్యక్షుడు గాజ శ్యాంసుందర్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పలపాడు పంచాయతీలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.





**బయ్యారం/,ఆగస్టు 15.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం ఉప్పలపాడు గ్రామపంచాయతీలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలపాడు సర్పంచ్ పానుగోతు వెంకన్న నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం 2025-26 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులు గూగులోత్ దీక్ష 2016 రూపాయలు, గుడిబోయిన కావేరి 1016 రూపాయలు సర్పంచ్ వెంకన్న బహుమతిగా అందించారు. ఈ సంవత్సరం కూడా పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సర్పంచ్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సోసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బయ్యారంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.



**బయ్యారం/,ఆగస్టు 15.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో దీపిక, తహసీల్దార్ కార్యాలయం తహసీల్దార్ నాగరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విజయ్ కుమార్,రైతు వేదికలో ఏవో రాజు,పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ ప్రశాంత్ బాబు,ఫారెస్ట్ కార్యాలయం లో ఎఫ్ఆర్వో రవి కిరణ్,బయ్యారం గ్రామపంచాయతీలో సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎందరో మహానుబావుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. దేశానికి త్యాగమూర్తుల చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఉద్యోగులు, పంచాయతీ ఉద్యోగులు,పోలీస్ సిబ్బంది ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**వర్ధన్నపేట/ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):** అంబేద్కర్‌నగర్ గ్రామానికి చెందిన చట్ట అలెక్సుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.92 వేల చెక్కును గ్రామ సర్పంచ్ చీటూరి రాజు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చింత బాబు, వార్డు సభ్యులు బంక సందీప్, యకరా సందీప్, యువజన సభ్యులు బంక సుధీర్, సింగరపు సుధీర్, బొక్కల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కాచనపల్లి జిపిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



**బయ్యారం/,ఆగస్టు 15.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కాచనపల్లి పంచాయతీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను సర్పంచ్ యలం రేవతి ఆవిష్కరించి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్,పంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది,ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది,ఆశ వర్కర్స్,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మైలారం ముద్దుబిడ్డకు ఉత్తమ గిర్దావర్ అవార్డు



**రాయపర్తి/ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గిర్దావర్ దశరథం రెడ్డికి ఉత్తమ గిర్దావర్ పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలనతోపాటు ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపినందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. తన సేవలను గుర్తించి అవార్డు అందించిన ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు దశరథం రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేస్తానన్నారు.

## సింగారంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

**బయ్యారం/,ఆగస్టు 15(జర్నలిస్ట్ వార్త)**



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగారం కమ్యూనిటీ హాలులో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. ఈ సందర్బంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుంచు మమత, వార్డు సభ్యులు చుంచు అనిల్ కుమార్,చెరుకుపల్లి మనీషా,గుగులోత్ అనూష,గుగులోత్ బద్రు నాయక్,బానోత్ సరిత,సపవత్ అనిత,పంచాయతీ కార్యదర్శి బాధవత్ సరిత,మాలోత్ శంకర్, గంగావత్ పద్మ,విద్యా కమిటీ చైర్మన్ గుగులోత్ స్వరూప,రమాదేవి,మాజీ ఎంపీటీసీ గంగావత్ గోపాల్ నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగావత్ రవికుమార్,నాయకులు చాట్ల వెంకన్న,చెరుకుపల్లి రవి,జీనుగు వెంకన్న,విజయ్,బాలరాజు,రాందాస్, మంగీలాల్,గ్రామ పంచాయతీ సిబ్బంది,మహిళలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గుతండ పంచాయతీలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**బయ్యారం/,ఆగస్టు 15.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలంలోని జగ్గుతండ గ్రామపంచాయతీలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎంతోమంది జాతియ నాయకులు తమ ప్రాణాలను అర్పించి ఈ దేశం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. వారి యొక్క ప్రాణ త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ సమానత్వం అని కొనియాడారు. ఈ వేడుకల్లో ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి,వార్డ్ సభ్యులు సావిత్రి, యాకేష్,రూపేష్,పావని,స్వాతి, దుర్గారావు,లలిత,కవిత, రాఘవేంద్రరావు,గ్రామ పెద్దలు చంద్రు మల్లయ్య, రామదాసు, వీరలక్ష్మి,పద్మా, నరసింహారావు, రామాచారి, వెంకటేశ్వర్లు, ముత్తయ్య,వర్ధయ్య, రమణయ్య, సోమన్న,ప్రభాకర్,సతీష్, సక్రు,మౌలా, రసూల్,సైదులు,ఆనంద్,చంద్రయ్య, సతీష్,నాగేంద్ర చారి,మహేష్,క్రాంతి సునీల్,బావ్ సింగ్,నాగబాబు,సైదులు, సాయి,జహీర్,వెంకటష్,యాకేష్,సెక్రటరీ శ్రీహరి,పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మొండ్రాయిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**సంగ్యెం/ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మొండ్రాయి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగుతూ దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కే. విజయ, గ్రామ సర్పంచ్ గూడ స్వరూప, ఉపసర్పంచ్ గూడ విజయ్‌కుమార్, ఏఐపీసీ రాష్ట్ర నాయకులు గూడ రాజేందర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతల రమేష్ మాదిగ, గ్రామ సేవకుడు పెల్లి పురుషోత్తంరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పరికి యాకయ్య, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు వేల్పుల ప్రభాకర్, అంబేద్కర్ యువజన సంఘం ముఖ్య సలహాదారు వేల్పుల భద్రయ్య, ఉపాధ్యక్షుడు పరికి మోహన్, వార్డు సభ్యుడు ప్రశాంత్, పరికి నాగమణి, మాజీ అధ్యక్షుడు పరికి రాజు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# నల్లబెల్లి నుంచి ఆలేరు వరకు..
# మహేందర్ జన్మదిన సందడి







**ఆలేరు/వర్ధన్నపేట, ఆగస్టు 15 (జర్నలిస్ట్ వార్త):**
ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ జన్మదిన వేడుకలు ఆలేరు నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లాలో , ఆయన స్వగ్రామమైన నల్లబెల్లితో పాటు హోటల్ వివేరాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నల్లబెల్లిలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రభాకర్ మాదిగ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మహేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆలేరు నియోజకవర్గ కేంద్రంలోనూ ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ నాయకులు కేక్ కట్ చేసి మహేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక న్యాయం, హక్కులు, ఆత్మగౌరవం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మహేందర్ చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో మరింత కాలం సామాజిక ఉద్యమానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. హోటల్ వివేరాలో జరిగిన కార్యక్రమంలో మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు బొడ్డు దయాకర్ మాదిగ, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ, సీనియర్ నాయకులు బిర్రు బిక్షపతి, ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల మాజీ ఉపాధ్యక్షుడు సింగరపు పవన్ మాదిగ తదితరులు పాల్గొని మహేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నల్లబెల్లి కార్యక్రమంలో కుల పెద్ద మనిషి బిర్రు బాబుమాదిగ జర్నలిస్టు ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు బిర్రు కరుణాకర్ మాదిగ, టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా నాయకుడు బిర్రు సురేందర్ మాదిగ, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు, మూడో వార్డు సభ్యుడు మరిపట్ల ప్రశాంత్ మాదిగ, , బిర్రు బిక్షపతి, బిర్రు రాజు, గణపాక రమేష్, గణపాక హరీష్, తాటికాయల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.







